# మరోస్పర్శ

- పి.యస్.నారాయణ

బాల్కనీలో నిలుచుని రోడ్డువంక చూస్తున్న సుభద్రకు గేటు తీసుకుని లోపలకు వస్తున్న ఆమె చిన్నన్నయ్య శంకరం కనబడ్డాడు. ఆమె ఆశ్చర్యంగా చూసింది అతనివైపు.

అప్పుడు సాయంత్రం ఆరుగంటలయింది. ఇంకా భర్త రాలేదు ఆఫీసునుంచి. కూతురు కాలేజీ నుంచి వచ్చి తన గదిలో కూర్చుని ఏవో పుస్తకాలు చదువుకుంటున్నది.

మెట్లమీద బూట్ల చప్పుడు దగ్గరవడంతో తలుపుదాకా వెళ్లింది సుభద్ర అన్నయ్యను ఆహ్వానించేందుకు.

ఆమెకు ఇద్దరన్నయ్యలు. తనొక్కతే ఆడపిల్ల ఆ ఇంట్లో.

శంకరం లోపలకు వచ్చాడు.

"ఏమే సుభద్రా! బాగున్నారా! ఎప్పుడైనా మేము రావాల్సిందేగానీ మీరు వచ్చేది లేదుకదా" అన్నాడు నిష్ఠూరంగా.

"వెధవ కబుర్లు చెప్పబోకన్నయ్యా! నీకా మీ కంపెనీలో సోమవారం సెలవు. నీ భార్యామణికా ఆదివారం సెలవు. మీ ఇద్దరూ కలసి ఏ రోజు ఇంట్లో వుంటారో చెప్పండి. మేం ఎందుకు రావడం లేదో నేను చెబుతాను" అన్నాను పెద్దగా.

శంకరం నవ్వేశాడు.

"ఎక్కడే చస్తున్నాం, నీకేం ఒక్కతే కూతురు. హాయిగా మెడిసిన్‌లో చేర్చేశావు. రేపు డాక్టరయి రెండు చేతులా సంపాదిస్తుంటే ఈ మేడ మీదే ఇంకో రెండంతస్థులు వేసి ఇంకా పైకెక్కి కూర్చుంటావ్" అన్నాడు.

"క్రిందనుంచి మంచినీళ్ళు మోస్తూ..." అన్నది నవ్వుతూ.

"నీకేం ఖర్మే. కో అంటే కోటిమంది పనివాళ్లు వస్తారు" అతడి మాటల్లో ఈర్ష్య ధ్వనిస్తుండగా ముఖం చిట్లించింది సుభద్ర.

"ఆ..అంత తేలికేమిటి! అయినా నాకు తెలియక అడుగుతాను. అది సంపాదించినా నాకెందుకు పెడుతుంది? రేపెవడో వచ్చి దాని మెడలో మూడుముళ్ళు వేస్తాడు చూడు, వాడి ముఖాన పోస్తుంది. ఇప్పుడు ఖర్చు పెట్టేంతవరకే మేము" అంటూ ఎదురుగా సోఫాలో కూర్చున్నది. "ఏమిటి అంతా కులాసాయేనా? పెద్దన్నయ్య వదినెలను చూసి కూడా చాలారోజులయింది. అంతా హైద్రాబాద్‌లో వున్నామనే పేరేగానీ తలా ఒక మూల. ఎవరింటికి వెళ్లాలన్నా మరో ఊరు వెళ్లినట్టే" అన్నది సుభద్ర.

"అంతా నీ దయవలన కులాసానే తల్లీ! ఓ చిన్న సమస్య వచ్చి ఇలా వచ్చాను" అన్నాడు నసుగుతున్నట్లుగా శంకరం.

సుభద్ర సోఫాలోంచి లేచింది "నాకు అర్థమయిందిలే... నీకు ఏ సమస్యా లేకపోతే ఇప్పుడు ఎందుకు వస్తావుగానీ టీ పెట్టుకు వస్తాను. త్రాగుతూ మాట్లాడుకుందాం" అంది వంటింట్లోకి వెడుతూ.

చెల్లెలంటే అన్నదమ్ములిద్దరికీ అందుకే మంట. ముఖం మీద కొట్టినట్టు మాట్లాడుతుంది వెనుకా ముందూ చూసుకోకుండా. ఆమె మాటలు కష్టమనిపించినా తను అవసరంతో వచ్చాడు కనుక శంకరం చిన్నగా నవ్వేసి ఊరుకున్నాడు.

సుభద్ర కూతురు అతడి మాటలు వింటూనే బయటకు వచ్చింది తన గదిలోంచి "నమస్తే మామయ్యా! అంతా కులాసానా?" అంటూ.

"కులాసాకేమున్నది మామూలే. అదో డైలీ సీరియల్ లాంటిది. బిపిలు, షుగర్లు, డాక్టర్లు, టెస్టులు, మందులూ ...నువ్వు నీ చదువు పూర్తి చేస్తే కనీసం డాక్టర్ ఫీజులయినా తప్పుతాయి అని ఆశపడుతూ ఎదురుచూస్తున్నాం" అన్నాడు శంకరం.

"పో మామయ్యా! నువ్వెప్పుడూ బీద అరుపులు అరుస్తూనే వుంటావు. ఇద్దరూ సంపాదిస్తున్నారు... హైదరాబాద్‌లో ఎన్ని లాకర్లు తీసుకున్నావో చెప్పరాదూ. విని సంతోషిస్తాం" అన్నది నవ్వుతూ.

వంటింట్లోంచి కూతురు మాటలు విన్న సుభద్ర పెద్దగా అన్నది "అలాంటి మంచి మాటలు మాట్లాడబోకు. వాళ్ళు నిజం చెప్పరు."

"ఇదీ మీ అమ్మ వరస. మీరేమన్నా నేను పట్టించుకోనులే. అది నా స్వంత చెల్లెలు. నువ్వు నా ఒక్కగానొక్క మేనకోడలివి" కడుపులో మండుతున్నా పైకి మాటల్ని ఆప్యాయతలో రంగరించి అన్నాడు శంకరం.

సుభద్ర టీ తెచ్చి శంకరంకోకప్పు ఇచ్చి తనో కప్పు తీసుకున్నది. కూతురు ఇక అక్కడ ఉండడం అనవసరం అన్నట్లుగా తన గదిలోకి వెళ్లిపోయింది.

"రాత్రి అన్నయ్య ఫోను చేసాడు" అన్నాడు టీ కొద్దిగా త్రాగి "బాగా కలిపావే. నీ చేతి టీ త్రాగి చాలా రోజులయింది" అన్న మెచ్చుకోలు మాట కూడా అన్నాడు ఎందుకైనా పనికొస్తుంది అన్నట్టుగా.

"అందులో నా గొప్పేంలేదుగానీ ఏమంటాడు ఆయన" అతడి మాటల్ని కత్తిరిస్తూ సుభద్ర అడిగింది.

"అమ్మకు ఒంట్లో బాగోలేదుట" అన్నాడు నసుగుతున్నట్లుగా.

"రెండు నెలలబట్టీ బాగాలేదుగదా! ఇవ్వాళ్ళ కొత్తేమున్నది?" అన్నది విసురుగా సుభద్ర. "పొద్దున లేచినప్పటినుంచీ మీ రెండిళ్లకీ గాడిద చాకిరీ చేసి చేసి అలా అయింది."

"అన్యాయంగా మాట్లాడకు. మా ఇళ్లల్లో పసిపిల్లలు ఎవ్వరూ లేరుకదా ఆమె ఆపసోపాలు పడుతూ చేయడానికి!"

"అరేయ్! ఒక్క మాట అడుగుతాను కోపం లేకుండా చెబుతావా? అదీ నువ్వు పసిపిల్లలు ఎవ్వరూ లేరు అన్నావు కాబట్టి!"

శంకరం ముఖం ముడుచుకు కూర్చున్నాడు.

"నువ్వు కాఫీ తాగి గ్లాసెక్కడ పెడతావు?"

అతడు మాట్లాడలేదు.

"ఎక్కడ కూర్చుని తాగితే అక్కడ పెడతావు. మీ ఆవిడ ఉద్యోగస్తురాలు. మొగుడిదైనా సరే ఎంగిలి గ్లాసు పట్టుకెళ్లి సింకులో పడేయడానికి ఆమెకు నామోషీ. తరువాత గంటకైనా రెండుగంటలకైనా అది ఎండి మరకలు కట్టినా సరే తీయవలసింది అమ్మ. ఆమె లేకపోతే పనిమనిషి అవునా!"

కోపంగా చూసాడు ఆమె మాటలకు శంకరం.

"రా అమ్మా కొన్నాళ్ళు నా దగ్గర వుందువుగానీ అంటే 'రేపు కొరివి పెట్టవలసిన వాళ్ళు వాళ్ళేనే. వాళ్ళను కాదని నేనెలా వచ్చి నీ దగ్గరుంటానే' అని పురాణం మొదలుపెడుతుంది ఆవిడగారు."

అలా వదిలేస్తే ఆమె గంటలు గంటలు తమను తిట్టిపోస్తూనే వుంటుందని శంకర్ భయం. అందుకనే ఆమె ఏమీ అన్నా కార్యార్థి అయి వచ్చాడు కాబట్టి ఏడుపుముఖం మీద కాస్తంత చిరునవ్వు అద్దుకుని నోరు తెరిచాడు.

"ఏదో అలా అలవాటయిందే! ఏం చేస్తాం! ఇప్పుడు ఈ వయస్సులో మారాలన్నా కష్టమే. ఇప్పటి సమస్య అది కాదు. నేను చెప్పింది కాస్త సావకాశంగా విను. వదిన వాళ్ళ నాన్న రిటైరై నాలుగేళ్లయింది. ఇన్నాళ్ళూ వాళ్ళు వాళ్ళ ఊళ్ళోనే ఉన్నారు. ఇప్పుడు వాళ్ళ ఆరోగ్యాలు కాస్త వెనుకంజ వేసినాయి. మరి వదిన ఒక్కతే కదా వాళ్ళకు కూతురు. మొగపిల్లలా లేరు. ఈమె దగ్గరికే వచ్చేస్తాం అంటున్నారట వాళ్ళు. వదిన వాళ్ళకూ, అమ్మకూ కూడా చేయంగలుగుతుందా అని బాధపడుతున్నాడు అన్నయ్య" అన్నాడు శంకరం.

"నిజమే మరి! ఇన్నాళ్ళూ అంటే కూర్చోకుండా చేసింది కాబట్టి ఇబ్బందిలేదు. ఇప్పటికీ ఆమె పనులు ఆమే చేసుకుంటున్నా వంట చేసి పెట్టాలంటే కష్టమేకదా పాపం పెద్ద వదినకు" అంది ఎగతాళిగా సుభద్ర.

"సతాయించినట్టు మాట్లాడబోకు" అన్నాడు చిరాగ్గా శంకరం.

"నేనన్నదాంట్లో అబద్ధమేమైనా వున్నదా?" రెట్టించింది సుభద్ర.

"ఇప్పుడు అవన్నీ అనుకుని ఏం లాభం? పరిష్కారం

ఆలోచించాలిగానీ! నేనున్నానా... ఇద్దరం పొద్దునే లేచి చెరో డబ్బా సర్దుకుని ఉద్యోగాలకు పరుగెడతాం'' అన్నాడు. తన ఇబ్బందులేవో తనూ చెప్పుకుంటూ శంకరం.

''మీ ఆవిడను ఉద్యోగం మానేయమను. అత్తగారి కంటే ఎక్కువా ఆ పోడి ఉద్యోగం?'' అన్నది అరుస్తున్నట్లుగా సుభద్ర.

''మీ ఆయనలాగా నాదేం పెద్ద ఉద్యోగంకాదు. మీ అమ్మాయికిలాగా మా పిల్లలకు పెద్ద ర్యాంకులేం వచ్చి చావడంలేదు గవర్నమెంటు కాలేజీల్లో డొనేషన్లు లేకుండా సీట్లు రావడానికి'' అన్నాడు ఈసడింపుగా శంకరం.

''మా ఆయనది పెద్ద ఉద్యోగమే. మా పిల్ల తెలివిగలదే. అవన్నీ అమ్మకు ఏ విధంగా వెసులుబాటు కలిగిస్తాయట! నేనేం కొడుకును కాదుకదా ఆమెకు'' ఆమెను పోషించే బాధ్యత నాది కాదు అన్నట్లుగా అన్యాపదేశంగా చెప్పింది సుభద్ర.

''ఈ రోజుల్లో కొడుకయితేనేం కూతురయితేనేం తల్లిదండ్రులను చూడడానికి'' అన్నాడు ఇంకేం మాట్లాడాలో తెలియక శంకరం ''ఏదో నాలుగురోజులు చూస్తావేమోనని...!''

''అలా అన్నావు బాగుందిరా చిన్నన్నయ్యా! మీతో సమానంగా సంవత్సరానికి ఓ నాలుగునెలలు నేనూ మా ఇంట్లో పెట్టుకుంటాను. మరి గుంటూరులో వున్న ఆ పాత పెంకుటి కొంపలోనూ, రెండెకరాల మామిడితోటలోనూ నాకూ భాగమిస్తారా?'' అన్నది పెళపెళా అతడి మీదకు రాళ్ళు విసురుతున్నట్లుగా!

''ఎంతకు తెగించావే నువ్వు! ఆమె స్వంత కూతురివి కాదుటే! ఆమెను నాలుగురోజులు చూస్తే పాపం చుట్టుకుంటుందా?'' అన్నాడు నిరసనగా శంకరం.

''అదేరా నేనూ అనేది! ఆమెకు స్వంత కూతురినే నేను. మీలాగానే ఆమెకే నేనూ పుట్టాను. మరి ఆమె ఆస్తిలో వాటాకు నేను పనికిరానా?'' కోపంతో సుభద్ర ముక్కుపుటాలు అదరసాగినాయి.

''ఉన్నది చాలదా? ఇంకా కావాలనే ఏడుపు దేనికి?'' శంకరమూ గయ్‌మని లేచాడు.

''డబ్బు చేదా? అంటే చాకిరికి నేను, డబ్బు మింగడానికి మీరూ. నా మొగుడికీ, నా కూతురికే చేయడానికి క్షణం తీరిక ఉండడంలేదు. ఇక లేవలేని ఆమెను కూడా తెచ్చి ఎక్కడ పెట్టుకునేది నెత్తిన. అందునా కొరివి పెట్టే కొడుకులు ఇద్దరుండగా!'' అన్నది ఆ విషయాన్ని తేల్చేస్తున్నట్లుగా సుభద్ర.

''నీ నోటికి అదుపు ఆజ్ఞలేవే. నీకు బంధుత్వాలు, ప్రేమలూ అసలే లేవు. డబ్బే ప్రధానం'' శంకరం చిందులేసుకుంటూ బయటకు నడిచాడు విసురుగా.

''మీకు లాగానే మరి!'' వెనుక నుంచి మరో చురక అంటించింది సుభద్ర.

అతడు అటు వెళ్ళగానే దుఃఖంతో సోఫాలో కూలబడింది. ఆమెకు తల్లిమీద ఏమాత్రం కోపంలేదు. ఆమెను తీసుకువచ్చి దగ్గర ఉంచుకోవాలనే ఉన్నది. కానీ ఇద్దరన్నయ్యల తీరు ఆమెకు మింగుడు పడడంలేదు.

ఎప్పుడయినా ఇబ్బందయి ఆమెను తీసుకువస్తే రెండు రోజులవడం ఆలస్యం తమ కొంపల్లో చాకిరీ చేసేందుకు మనిషి కావాల్సి ఆమెను ఇక్కడ ఉండనిచ్చేవాళ్ళుకాదు. ఇప్పుడు ఆమె ఎవరికీ చేయలేదు. కనుక వాళ్ళకు అక్కర్లేదు. తనింటికి పంపించేయాలని ఆలోచన.. వెధవలు!

● ● ●

రెండురోజుల తరువాత రాత్రి పదిగంటలప్పుడు ఫోను మోగుతుంటే సుభద్ర భర్త ఫోనెత్తాడు.

''నేనయ్యా చలపతి! మీ అత్తయ్యను!'' అన్నది సుభద్ర తల్లి అటునుంచి. ''అమ్మాయి పడుకున్నదా?''

''నమస్కారం అత్తయ్యగారూ! బాగున్నారా! ఆరోగ్యం ఎలా వున్నది?'' పరామర్శించాడు చలపతి.

''కాటికి కాళ్ళు చాస్తున్నదాన్ని ఇంకా ఆరోగ్యం ఎలా వుంటుందయ్యా! చిన్నవాడు మీ ఇంటికివస్తే నానా మాటలూ అన్నదట సుభద్ర. అది నిజమేనా అని అడుగుదామని?'' చిన్నగా గొణుగుతున్నట్లుగా అన్నది ఆమె.

చలపతి ఆలస్యం చేయలేదు.

''నానా మాటలూ అంటూ ఏమీ అనలేదుగానీ... రెండు చురకలు అంటించానని మాత్రం నాతో అన్నది. అయినా అదన్న దాంట్లో నాకేం తప్పు కనిపించడం లేదు'' అన్నాడు నవ్వుతూ.

''నువ్వూ అలాగే అంటే నా బ్రతుకేం కావాలి నాయనా'' అన్నది దుఃఖంతో గొంతు పూడుకుపోతుండగా!

''అత్తయ్యగారూ! మీరేం కంగారుపడకండి. మీ అమ్మాయి మీకేం శత్రువుకాదు. ఆమెకు మీ మీద ప్రేమ లేకాకాదు. మా బావమరుదుల పిల్లలతో మాట్లాడాను నేను. వాళ్ళు మంచి బుద్ధిమంతులు. వాళ్ళ అత్తయ్యను అర్థం చేసుకున్నవాళ్ళు. రేపో మాపో వాళ్ళు పెద్దవాళ్ళను నిలదీయబోతున్నారు. 'బామ్మను సరిగ్గా చూస్తారా! లేకపోతే రేపు మీకూ అదే వయసులో మిమ్మల్నీ ఇదే పరిస్థితి కల్పించమంటారా?' అని. దానికి వాళ్ళ సమాధానం కూడా ఏమిటో విననీయండి'' అన్నాడు చలపతి.

ఆమె ఏడుపును ఆపుకోలేపోయింది.

''పిల్లల్ని పెద్దవాళ్ళమీదకు ఎగదోస్తే నా బ్రతుకు బాగుపడుతుందా నాయనా?'' అన్నది దిగులుగానూ, భయంగానూ!

''అత్తయ్యగారూ! మీరు పొరపాటు పడుతున్నారు. మీ కోసం సుభద్ర ఇక్కడ అన్ని ఏర్పాట్లూ చేస్తున్నది. మీ కొడుకులు చేస్తున్న తప్పేమిటో వాళ్ళకు తెలిసిరావాలని, మనస్సుకు బాధగా వున్నా మీ చిన్నబ్బాయితో అలా అన్నది. అంతే! మీకెప్పుడు ఇక్కడకు రావాలని అనిపిస్తే అప్పుడు ఓ ఫోను కొట్టండి. నేను కారు తీసుకువస్తాను. ఇక్కడ అందరూ మీకు స్వాగతం చెప్పడానికి ఎదురు చూస్తున్నారు. ఇది మీ ఇల్లే అనుకోండి. నన్ను నమ్మండి'' అన్నాడు చలపతి ఆమెను ఓదారుస్తూ.

★

